క్లుప్తంగా

రైతు రుణమాఫీ ప్రకటనపై హర్షం

కోదాడరూరల్ : సీఎం రేవంత్‌రెడ్డి ఆగస్టు 15 నాటికి రూ.2 లక్షల రైతు రుణమాఫీ చేస్తామని ప్రకటించడం పట్ల కోదాడ పీఏసీఎస్ చైర్మన్ ఓరుగంటి శ్రీనివాసరెడ్డి హర్షం వ్యక్తం చేశారు. శనివారం కోదాడలోని పీఏసీఎస్ కార్యాలయంలో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. తమ సంఘం పరిధిలోని వందల మంది రైతులకు రూ.11 కోట్ల మేర రుణమాఫీ వర్తిస్తుందని తెలిపారు. కార్యక్రమంలో సంఘం డైరెక్టర్లు తదితరులు ఉన్నారు.

ఎన్నికల కోడ్ ముగియగానే రుణమాఫీ అమలు చేయాలి

కోదాడరూరల్ : రైతు రుణమాఫీని ఎన్నికల కోడ్ ముగియగానే అమలు చేయాలని తెలుగు రైతు సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కొల్లు వెంకటేశ్వరరావు శనివారం ఒక ప్రకటనలో కోరారు. ఎన్నికల ముందు సీఎం రేవంత్‌రెడ్డి డిసెంబర్ 9న రైతు రుణమాఫీ చేస్తానని, ఆ తర్వాత వంద రోజులు గడువు అడిగారని తెలిపారు. ఇప్పుడు మాత్రం ఆగస్టు 15 వరకు డెడ్‌లైన్ ఎందుకు పెడుతున్నారని ఆయన ప్రశ్నించారు. రుణ మాఫీ పొడిగిస్తూ రైతులకు ఆశ చూపి స్థానిక సంస్థల ఎన్నికల్లో కూడా లబ్ధి పొందాలని చూస్తున్నారని తెలిపారు.

యువత సన్మార్గంలో నడవాలి



మాట్లాడుతున్న ఎస్ఐ రవీందర్‌నాయక్

నేరేడుచర్ల : యువత చెడు వ్యసనాలకు గురికాకుండా సన్మార్గంలో నడవాలని నేరేడుచర్ల ఎస్ఐ రవీందర్‌నాయక్ అన్నారు. శనివారం నేరేడుచర్ల మండలం దిర్శించర్లలో పోలీస్ కళాబృందం ఆధ్వర్యంలో నిర్వహించిన అవగాహన కార్యక్రమంలో పాల్గొని మాట్లాడారు. ప్రజలు సైబర్ మోసగాళ్ల పట్ల అప్రమత్తంగా ఉండాలని సూచించారు. వ్యక్తిగత వివరాలు, బ్యాంకు ఖాతా, ఏటీఎం, ఓటీపీ వివరాలను ఇతరులకు తెలియజేయద్దన్నారు. సైబర్ మోసాలకు గురైతే 1930 టోల్ ఫ్రీ నంబరుకు ఫోన్ చేసి తెలియజేయాలన్నారు. కార్యక్రమంలో కళా బృందం ఇన్‌చార్జ్ ఎల్లయ్య, పోలీస్ సిబ్బంది గోపి, కృష్ణాచారి, వెంకన్న తదితరులు ఉన్నారు.

బీజేపీని ఓడించాలి

దురాజ్‌పల్లి (సూర్యాపేట) : కార్మికవర్గం పోరాడి సాధించుకున్న చట్టాలను లేకుండా చేసిన కేంద్రంలోని బీజేపీని ఓడించాలని ఐఎఫ్‌టీయూ రాష్ట్ర ఉపాధ్యక్షురాలు ఎస్ఎల్ పద్మ అన్నారు. శనివారం పట్టణంలోని ఎంవీఎన్ భవన్‌లో ఏర్పాటు చేసిన ఇఫ్టూ జిల్లా కమిటీ సమావేశంలో ఆమె మాట్లాడారు. ఎస్‌డీ.సయ్యద్ హుస్సేన్ అధ్యక్షతన జరిగిన సమావేశంలో జిల్లా ప్రధాన కార్యదర్శి వీరబోయిన రమేష్, కోశాధికారి వాజిద్, సభ్యులు చిత్తలూరు లింగయ్య, సయ్యద్, పాల్గొన్నారు.

అంగన్‌వాడీల వేతనాలను వెంటనే విడుదల చేయాలి

నేరేడుచర్ల : గత రెండు నెలలుగా పెండింగ్‌లో ఉన్న అంగన్‌వాడీ టీచర్లు, హెల్పర్ల వేతనాలను వెంటనే విడుదల చేయాలని సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యుడు ధనుంజయనాయుడు శనివారం ఒక ప్రకటనలో కోరారు. గర్భిణులు, బాలింతలు, చిన్నారులకు పౌష్టికాహారాన్ని అందించడమే కాకుండా ఐదేళ్లలోపు పిల్లలకు ఆటాపాటల ద్వారా చదువు చెప్పుతున్న అంగన్‌వాడీలకు రెండు నెలలుగా వేతనాలను విడుదల చేయకపోవడం బాధాకరమని తెలిపారు. ప్రభుత్వ ఉద్యోగులతో పాటు అంగన్‌వాడీ, ఆశా వర్కర్లు, ఔట్ సోర్సింగ్ ఉద్యోగులకు ప్రతి నెల మొదటి తారీకున వేతనాలను చెల్లించాలని కోరారు.

కార్మికుల దినోత్సవాన్ని విజయవంతం చేయాలి

నడిగూడెం : మండల కేంద్రంలో మే 1న నిర్వహించనున్న ప్రపంచ కార్మికుల దినోత్సవాన్ని విజయవంతం చేయాలని సీపీఎం మండల కార్యదర్శి బెల్లంకొండ సత్యనారాయణ కోరారు. శనివారం నడిగూడెంలోని సీపీఎం కార్యాలయంలో పార్టీ ముఖ్య కార్యకర్తల సమావేశంలో మాట్లాడారు. మాజీ వైస్ ఎంపీపీ కొరట్ల శ్రీనివాస్, మాజీ సర్పంచ్ బెల్లంకొండ హనుమయ్య, రేఖ తిరపయ్య పాల్గొన్నారు.

ప్రకృతి వ్యవసాయంపై రైతులకు అవగాహన

మునగాల : సహజసిద్ధ పద్ధతులతో కూరగాయల సాగు చేపట్టాలని సిరి ఫౌండేషన్ వ్యవస్థాపకుడు మొలుగూరి గోపయ్య కోరారు. మండల కేంద్రంలో కూరగాయల సాగు చేస్తున్న రైతులకు ఆయన శనివారం ప్రకృతి వ్యవసాయంపై అవగాహన కల్పించి మాట్లాడారు. రోజురోజుకూ సాగులో రసాయన ఎరువులు, పురుగుమందుల వినియోగం పెరుగుతుందని, ఈ విధంగా పండించిన కూరగాయలను ఆహారంగా తీసుకుంటే ప్రజలు జబ్బుల పాలవుతున్నారని, క్యాన్సర్ వ్యాధి సోకుతుందని హెచ్చరించారు. కావున ప్రతి రైతు సహజసిద్ధ పద్ధతులతో సాగు విధానానికి అలవాటు పడాలని సూచించారు. నేల ఆరోగ్యంగా ఉండాలంటే పశువుల ఎరువులు, జీవామృతం, ఘన జీవామృతం వాడాలని, కూరగాయలలో ఆశించే చీడపీడల నివారణకు వేపగింజల ద్రావణం, నీమాస్త్రం, దశపత్ర కషాయం వాడి సమర్థవంతంగా నివారించవచ్చన్నారు. కార్యక్రమంలో ఆదర్శ రైతులు పాపారావు, పుల్లయ్య తదితరులు పాల్గొన్నారు.

అల్లాడుతున్న మూగజీవాలు

- నిరుపయోగంగా నీటితొట్లు
- పలు గ్రామాల్లో ఎండిపోయిన చెరువులు, కుంటలు
- పశువులకు తప్పని నీటి కష్టాలు



సీతారాంపురంలో నిరుపయోగంగా ఉన్న నీటితొట్టి



బూరుగడ్డలో నీటికోసం వెళ్లి చెరువులో దిగబడిన గేదె

హుజూర్‌నగర్‌రూరల్ : రోజురోజుకు పెరుగుతున్న భానుడి ప్రతాపానికి భూగర్భజలాలు అడుగంటాయి. దీంతో పలు గ్రామాల్లో చెరువులు, కుంటలు, బావులు, బోర్లు ఎండిపోయాయి. ఎక్కడ చూసినా చుక్కనీరు దొరకకపోవడంతో మూగజీవాలు అల్లాడుతున్నాయి. నీటితొట్ల వైపు ఆశగా చూస్తున్నాయి. కానీ నీటితొట్లను వినియోగంలోకి తీసుకురావడంలో అధికారులు నిర్లక్ష్యం వ్యవహరిస్తున్నారు. దీంతో కొన్నిచోట్ల మురుగు నీటితోనే మూగజీవాలు దప్పిక తీర్చుకోవాల్సిన దుస్థితి నెలకొంది.

మరమ్మతులతో వినియోగంలోకి..

గ్రామాల్లో రూ.లక్షలు వెచ్చించి నిర్మించిన నీటి తొట్లను పాలకులు, అధికారులు పట్టించుకోకపోవడంతో అవి నిరుపయోగంగా మారాయి. వాటికి చిన్న చిన్న మరమ్మతులు చేయిస్తే వినియోగంలోకి వస్తాయి. కొన్ని పగుళ్ల భారిన పడగా మరికొన్ని ఉపయోగంలో లేకుండా పోయాయి. అధికారులు చొరవ తీసుకుని తొట్లకు నీటి వసతి కల్పించాలని పలువురు రైతులు కోరుతున్నారు.

నిర్వహణ లోపంతో..

అయితే గ్రామాల్లో పశువుల దాహార్తిని తీర్చాలనే లక్ష్యంతో గతంలో ప్రభుత్వం జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం నిధులతో ఒక్కో నీటి తొట్టికి రూ.25 వేల చొప్పున వెచ్చించి నిర్మించింది. కానీ కొద్దిరోజుల వరకే అందులో నీటిని నింపారు. ఆ తరువాత అధికారులు పర్యవేక్షణ కరువై, నిర్వహణ లోపంతో అవి శిథిలావస్థకు చేరాయి. అయితే గ్రామాల్లో పంచాయతీ పాలకవర్గాలు పశువులకు నీటి వసతి కల్పించాల్సి ఉంది. కానీ సర్పంచ్‌ల పదవీకాలం ముగియడంతో గ్రామాల్లో ప్రత్యేక అధికారుల పాలన కొనసాగుతోంది. పశువులకు నీటి సౌకర్యం కల్పించాల్సిన బాధ్యత వీరిపై ఉంది.

పశువులకు తాగునీరు దొరకడం లేదు



“ఎండలు మండిపోతుండడంతో నీరు దొరక్క పశువులు అల్లాడుతున్నాయి. గ్రామాల్లో నిర్మించిన నీటి తొట్లు నిరుపయోగంగా ఉన్నాయి. దీంతో రైతులు పశువులకు నీరు తాపేందుకు చెరువులు, కుంటలను ఆశ్రయించాల్సి వస్తోంది.

– గునగంటి కనకయ్య, రైతు, సీతారాంపురం

నీటితొట్లను వినియోగంలోకి తేవాలి



“గతంలో ఉన్న నీటి తొట్లను వినియోగంలోకి తీసుకురావడంతో పాటు కొత్తగా ప్రతి గ్రామ పంచాయతీలో రెండు నీటి తొట్లు నిర్మించాలి. నీటి తొట్లు ఏర్పాటు చేసే దిశగా అధికారులు చొరవ చూపాలి.

– కామళ్ల ప్రభాకర్, పాడి రైతు, వేపలసింగారం

వరికొయ్యలకు నిప్పు పెడితే చర్యలు

- కోదాడ ఆర్డీఓ సూర్యనారాయణ



మండల స్థాయి అధికారుల సమావేశంలో మాట్లాడుతున్న ఆర్డీఓ సూర్యనారాయణ

మునగాల : ప్రస్తుత వేసవిలో రైతులు వరికొయ్యలకు నిప్పు పెట్టకుండా చూడాలని, నిప్పు పెట్టిన రైతులపై కఠిన చర్యలు తీసుకోవాలని కోదాడ ఆర్డీఓ సూర్యనారాయణ అధికారులను ఆదేశించారు. శనివారం మునగాల మండల కేంద్రంలోని ఎంపీడీఓ కార్యాలయంలో నిర్వహించిన మండల స్థాయి అధికారుల సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడారు. వరికొయ్యలకు నిప్పు పెట్టడంతో మంటలు వ్యాపించి హరితహారం చెట్లు దగ్ధమవుతున్నాయని తెలిపారు. పంచాయతీ కార్యదర్శులు, ప్రత్యేక అధి కారులు గ్రామాల్లో రైతులకు హరితహారం రక్షణపై అవగాహన కల్పించాలని కోరారు. ఈ సమావేశంలో ఎంపీడీఓ కె.రమేష్‌దీనదయాళ్, తహసీల్దార్ వలిగొండ ఆంజనేయులు, ఎంపీఓ భూపాల్‌రెడ్డి, వ్యవసాయాధికారి అనిల్‌కుమార్, ఏఎస్ఐ, వ్యవసాయ విస్తరణాధికారులు, పంచాయతీ కార్యదర్శులు పాల్గొన్నారు. అనంతరం బరాఖత్‌గూడెంలో ఆర్డీఓ ఓటరు స్లిప్‌లు పంపిణీ చేశారు.

పోలింగ్ కేంద్రాల్లో సౌకర్యాలు కల్పించాలి

- హుజూర్‌నగర్ ఆర్డీఓ శ్రీనివాసులు



మఠంపల్లిలో మాట్లాడుతున్న ఆర్డీఓ శ్రీనివాసులు

మఠంపల్లి : పార్లమెంట్ ఎన్నికల నేపథ్యంలో మండలంలో ఏర్పాటు చేసిన పోలింగ్ కేంద్రాల్లో సౌకర్యాలు కల్పించాలని ఆర్డీఓ శ్రీనివాసులు అన్నారు. శనివారం ఆయన మఠంపల్లి మండల పరిషత్ కార్యాలయంలో పోలింగ్ కేంద్రాల నిర్వహణపై జరిగిన సమీక్షా సమావేశంలో పాల్గొని మాట్లాడారు. పోలింగ్ అధికారులకు భోజన వసతితో పాటు, మంచినీరు, విద్యుత్, బాత్‌రూమ్‌లు, ఫ్యాన్లు తదితర మౌలిక వసతులను ఏర్పాటు చేయాలన్నారు. ఈ సమావేశంలో ఎంపీడీఓ జానకిరాములు, మఠంపల్లి, హుజూర్‌నగర్ మండలాల తహసీల్దార్‌లు మంగా, నాగార్జున్‌రెడ్డి, పంచాయతీ కార్యదర్శులు తదితరులు పాల్గొన్నారు.

శ్రీలక్ష్మీకోటమైసమ్మ ఆలయంలో ప్రత్యేక పూజలు



అమ్మవారికి పూజలు చేస్తున్న భక్తులు

కోదాడ : పట్టణంలోని బొడ్రాయి సమీపంలో ఉన్న శ్రీలక్ష్మీకోటమైసమ్మ ఆలయ ఐదవ వార్షికోత్సవాన్ని శనివారం ఆలయ కమిటీ సభ్యులు వైభవంగా నిర్వహించారు. ఈ సందర్భంగా వేద పండితులు అమ్మవారికి ప్రత్యేక అభిషేకాలు, అర్చనలు నిర్వహించి ప్రత్యేకంగా అలంకరించారు. భక్తులు అమ్మవారిని దర్శించుకొని ప్రత్యేక పూజలు చేశారు. హోమంలో పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో రామినేని శ్రీనివాసరావు, శ్రీదేవి, ఆవుల రంగారావు, కామేశ్వరి, సట్టు నాగేశ్వరరావు, ఆవుల రామారావు, మేళ్లచెరువు కోటేశ్వరరావు, నాగుబండి రంగనాథ్, పైయిడిమర్రి నారాయణరావు, వెంకటనారాయణ, తోట శ్రీను, గంధం రంగయ్య, చింతలపాటి సైదయ్య, వేములు రాముడు, వట్టివేళ్ల రవీందర్‌రెడ్డి, గంధం పాండు, ఆలేటి సత్యనారాయణ, పుల్లయ్య, గౌసొద్దీన్, దాసు, కొండల్ తదితరులు పాల్గొన్నారు.

రైస్ మిల్లు తనిఖీ



బేతవోలులోని ఆంజనేయస్వామి రైస్‌మిల్లును తనిఖీ చేస్తున్న తహసీల్దార్ ధ్రువకుమార్

చిలుకూరు : ఐకేపీ కొనుగోలు కేంద్రాల నుంచి వచ్చిన ధాన్యాన్ని వెంటనే దిగుమతి చేసుకోవాలని తహసీల్దార్ ధ్రువకుమార్ మిల్లు నిర్వాహకులకు సూచించారు. జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు చిలుకూరు మండలంలోని బేతవోలు గ్రామంలో గల అంజనేయ రైస్‌మిల్లును శనివారం ఆయన తనిఖీ చేశారు. ఈ సందర్భంగా రైసు మిల్లులోని నిల్వల రికార్డులను ఆయన పరిశీలించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. మిల్లుకు 28 లారీల ఐకేపీ ధాన్యం వచ్చిందని, ఇందులో 8 లారీల ధాన్యం దిగుమతి అయిందని, మిగిలిన ధాన్యాన్ని త్వరితగతిన దిగుమతి చేసుకోవాలని ఆయన అన్నారు. ఈ కార్యక్రమంలో ఆర్ఐ మంత్రిప్రగడ సీతారామచంద్రరావు తదితరులు పాల్గొన్నారు.

ముగిసిన ఆలయ వార్షికోత్సవం



అళ్వారాదులకు స్నాపనం నిర్వహిస్తున్న అర్చకులు, ఉత్సవ కమిటీ సభ్యులు

హుజూర్‌నగర్‌రూరల్ : మండలంలోని బూరుగడ్డలో ఉన్న శ్రీఆదివరాహ లక్ష్మీనర్సింహ వేణుగోపాలస్వామి ఆలయంలో శనివారం అళ్వారాదులకు స్నాపనం కార్యక్రమాన్ని వైభవంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయంలో ఉదయం సుప్రభాత సేవ, ఆరాధన, బాలభోగం, సేవాకాలం, శ్రీ రుక్మిణీ సత్యభామ గోదా సమేత శ్రీవేణుగోపాలస్వామి వారికి రాజ్యలక్ష్మీనర్సింహస్వామి వారికి అళ్వారాదులకు స్నాపనం, శతఘటాభిషేకం, ఆరగింపు, తీర్థప్రసాద వితరణ తదితర కార్యక్రమాలను ఘనంగా నిర్వహించారు. అనంతరం శృంగార డోలోత్సవం, పవళింపుసేవతో ఆలయ వార్షికోత్సవ సమాప్తి కార్యక్రమాన్ని శాస్త్రోక్తంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఆర్చకులు ముడుంబై పవన్‌కుమార్‌చార్యులు, మనోహరాచార్యులు, హరీష్‌కుమార్ చార్యులు, ఉత్సవ కమిటీ సభ్యులు యరగాని భిక్షం, నర్సింహారావు, గురవయ్య, వీరబాబు, గంగయ్య, ఆలయ సిబ్బంది, భక్తులు పాల్గొన్నారు.

హుండీ ఆదాయం రూ.71.510

బూరుగడ్డలో ఉన్న శ్రీఆదివరాహ లక్ష్మీనర్సింహ వేణుగోపాలస్వామి ఆలయంలోని హుండీని శనివారం ఆలయ పరిశీలకుడు టి.వెంకటచలపతి ఆధ్వర్యంలో లెక్కించారు. రూ.71 వేల 510 ఆదాయం వచ్చినట్లు ఆయన తెలిపారు.

కార్మికవర్గంపై భారం మోపుతున్న బీజేపీ



సమావేశంలో మాట్లాడుతున్న సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షుడు శీలం శ్రీను

హుజూర్‌నగర్ : బీజేపీ ప్రభుత్వం కార్మిక వ్యతిరేక చట్టాలను తీసుకొస్తున్నదని సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షుడు శీలం శ్రీను ఆరోపించారు. శనివారం హుజూర్‌నగర్‌లోని సీఐటీయూ కార్యాలయంలో పిల్లలమర్రి వెంకన్న అధ్యక్షతన నిర్వహించిన సీఐటీయూ పట్టణ కమిటీ సమావేశంలో ఆయన మాట్లాడారు. దేశంలో బీజేపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన నాటి నుంచి కార్మిక వర్గంపై భారం మోపుతుందని అన్నారు. కార్మికులకు పని గంటలు పెంచి, సంఘం పెట్టుకునే హక్కులను కాలరాస్తుందని తెలిపారు. కార్మిక, ప్రజా రైతు వ్యతిరేక విధానాలను అవలంబిస్తున్న బీజేపీని పార్లమెంట్ ఎన్నికల్లో ఓడించాలని కోరారు. మే 1న మే డే ఉత్సవాలను ఘనంగా జరపాలని పేర్కొన్నారు. ఈ సమావేశంలో నాయకులు సైదులు, నరసింహారావు, రవి, సింధు, శ్రీను, పర్వతాలు, రాంబాబు, గురవయ్య తదితరులు పాల్గొన్నారు.

నేడు విద్యుత్ సరఫరాలో అంతరాయం

హుజూర్‌నగర్ : హుజూర్‌నగర్ పట్టణం – 2 ఫీడర్ పరిధిలో విద్యుత్ లైనుకు అడ్డుగా ఉన్న చెట్ల కొమ్మలను తొలగించుట గురించి ఆదివారం ఉదయం 7 గంటల నుంచి 10 గంటల వరకు విద్యుత్ సరఫరాలో అంతరాయం కలుగుతుందని విద్యుత్ ఏఈ రాంప్రసాద్ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. పట్టణంలోని చింతల బజార్, మిర్యాలగూడెం రోడ్, సీతారాంనగర్ ప్రాంతాల్లో ఏరియాలో విద్యుత్ సరఫరా నిలిపివేయనున్నట్లు ఆయన తెలిపారు.

అనంతగిరి మండలంలో..

అనంతగిరి: మండలంలోని చనుపల్లి, పాలారం, త్రిపురవరం గ్రామాల్లో ఆదివారం ఉదయం 7:30 గంటల నుంచి 11 గంటల వరకు విద్యుత్ సరఫరాలో అంతరాయం ఏర్పడనుందని మండల విద్యుత్ ఏఈ కీర్తిరెడ్డి శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. సిరిపురం ను ంచి చనుపల్లి సబ్‌స్టేషన్ వరకు గల 33 కేవీ లై న్‌కు అడ్డుగా ఉన్న చెట్లకొమ్మలను తొలగించనున్నందున విద్యుత్ నిలిపివేస్తున్నట్లు తెలిపారు.

వడదెబ్బ తగలకుండా జాగ్రత్తలు తీసుకోవాలి



ఉపాధి హామీ కూలీలకు ఓఆర్ఎస్ ప్యాకెట్లు అందజేస్తున్న ఎంపీడీఓ వనజ

గరిడేపల్లి : ఎండల తీవ్రత దృష్ట్యా ఉపాధి హామీ కూలీలు వడదెబ్బ తగలకుండా జాగ్రత్తలు తీసుకోవాలని ఎంపీడీఓ కన్మంతరెడ్డి వనజ అన్నారు. శనివారం గరిడేపల్లి మండల కేంద్రంలోని చెరువులో ఉపాధి హామీ పథకం కింద చేపట్టిన పూడికతీత పనులను ఆమె పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె కూలీలకు ఓఆర్ఎస్ ప్యాకెట్లు, తాగునీరు అందించారు. అనంతరం ఆవ మాట్లాడారు. గ్రామ పంచాయతీ సహకారంతో పని ప్రదేశంలో కూలీలకు నీడ కోసం షేడ్ నెట్ ఏర్పాటు చేసినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎంపీఓ మౌలానా, ఏపీఓ సురేష్, ఈసీ సుజాత, టీఏ శిరీష, పంచాయతీ కార్యదర్శి సురేష్, ఫీల్డ్ అసిస్టెంట్ సరిత తదితరులు పాల్గొన్నారు.

గడ్డిపల్లి కృషి విజ్ఞాన కేంద్రంలో స్వర్ణోత్సవం



వేడుకల్లో పాల్గొన్న కేవీకే ప్రోగ్రాం ఇన్‌చార్జ్ కోఆర్డినేటర్ నరేష్, తదితరులు

గరిడేపల్లి : దేశంలో కృషి విజ్ఞాన కేంద్రాలు ఏర్పాటు చేసి 50 సంవత్సరాలు పూర్తయిన సందర్భంగా శనివారం గరిడేపల్లి మండలంలోని గడ్డిపల్లి కృషి విజ్ఞాన కేంద్రంలో స్వర్ణోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా కేవీకే ప్రోగ్రాం ఇన్‌చార్జ్ కోఆర్డినేటర్ డి.నరేష్ మాట్లాడుతూ.. కృషి విజ్ఞాన కేంద్రాల ద్వారా రైతులకు వ్యవసాయంలో వివిధ పద్ధతులపై శిక్షణ, అవగాహన కార్యక్రమాలు, రైతు సదస్సులు వంటివి నిర్వహించి వారికి సాంకేతిక విషయాలు తెలియజేస్తుండడంతో వారు పంటలో దిగుబడులు పొందగలుగుతున్నారని తెలిపారు. ముందుందు రైతుల కోసం మరిన్ని కార్యక్రమాలు నిర్వహిస్తామని తెలిపారు. ముందుగా స్వర్ణ జ్యోతి ర్యాలీని ఆయన ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో కేవీకే శాస్త్రవేత్తలు, సిబ్బంది, రైతులు తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా బీఆర్ఎస్ పార్టీ ఆవిర్భావ దినోత్సవం



నేరేడుచర్ల : బీఆర్ఎస్ పార్టీ కార్యాలయంలో కేక్ కట్ చేస్తున్న నాయకులు



మునగాలలో వేడుకల్లో పాల్గొన్న నాయకులు

నేరేడుచర్ల : పట్టణంలోని బీఆర్ఎస్ పార్టీ కార్యాలయంలో శనివారం బీఆర్ఎస్ పార్టీ ఆవిర్భావ దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా కేక్ కట్ చేసి పంపిణీ చేశారు. కార్యక్రమంలో డీసీసీబీ డైరెక్టర్ దొండపాటి అప్పిరెడ్డి, నాయకులు నాగండ్ల శ్రీధర్, చిత్తలూరి సైదులు, చిట్యాల శ్రీను, శ్రీనునాయక్, రాములు, అంజిరెడ్డి, భరత్, వెంకన్న, సీతారాములు తదితరులు ఉన్నారు.

మునగాల : మండలంలోని పలు గ్రామాల్లో శనివారం బీఆర్ఎస్ పార్టీ 24వ ఆవిర్భావ దినోత్సవాన్ని ఆ పార్టీ నాయకులు, కార్యకర్తలు ఘనంగా జరుపుకున్నారు. ఈ సందర్భంగా గ్రామాల్లో బీఆర్ఎస్ జెండాను ఆవిష్కరించారు. మండల కేంద్రంలో బీఆర్ఎస్ గ్రామ శాఖ అధ్యక్షుడు ఉడుం కృష్ణ ఆధ్వర్యంలో నిర్వహించారు. ఆయా కార్యక్రమాల్లో పార్టీ మండల నాయకులు కందిబండ సత్యనారాయణ, నల్లపాటి నాగరాజు, షేక్ సైదా, కుపిరెడ్డి నవీన్‌రెడ్డి, నారగాని వెంకన్న, ఉడుం కృష్ణ పాల్గొన్నారు.

ముమ్మరంగా ఓటరు స్లిప్‌ల పంపిణీ



మఠంపల్లి : సుల్తాన్‌పూర్‌తండాలో ఓటరు స్లిప్‌లు పంపిణీ చేస్తున్న కార్యదర్శి, బీఎల్‌ఓలు

మఠంపల్లి : మండలంలో పార్లమెంట్ ఎన్నికల ఓటరు స్లిప్‌లను శనివారం పంపిణీ చేశారు. మఠంపల్లి, సుల్తాన్‌పూర్‌తండా, పెదవీడు, అల్లీపురం తదితర గ్రామాల్లో ఓటరు స్లిప్‌ల పంపిణీని ఎంపీడీఓ జానకిరాముల పర్యవేక్షించారు. అనంతరం ఆయన విలేకరులతో మాట్లాడారు. మండల వ్యాప్తంగా ఉన్న 42 పోలింగ్ బూత్‌ల పరిధిలో ప్రతి ఒక్క ఓటరుకు ఓటరు స్లిప్‌లు అందజేస్తున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో కార్యదర్శులు మద్దుల వెంకటేశ్వర్లు, లక్ష్మణ్‌నాయక్, నరేందర్‌రెడ్డి, మట్టయ్య, బీఎల్‌ఓలు తదితరులు ఉన్నారు.

నడిగూడెం : మే 13న పార్లమెంట్ ఎన్నికల జరగనున్న నేపథ్యంలో నడిగూడెం మండలంలోని సిరిపురంలో శనివారం ఇంటింటికీ ఓటరు స్లిప్‌లను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో బీఎల్‌ఓలు ఆర్.సతీష్ కుమార్, వట్టికూటి లక్ష్మి, ఎలగొండ నిర్మల, కొత్తపల్లి శైలజ, తదితరులు పాల్గొన్నారు.

భవన నిర్మాణ కార్మికులకు సంక్షేమ పథకాలు అందించాలి



సమావేశంలో మాట్లాడుతున్న యల్క సోమయ్యగౌడ్

గరిడేపల్లి : భవన నిర్మాణ కార్మికులకు ప్రభుత్వం సంక్షేమ పథకాలు అందించాలని భవన నిర్మాణ కార్మిక సంఘం (సీఐటీయూ అనుబంధ సంఘం) జిల్లా ప్రధాన కార్యదర్శి యల్క సోమయ్యగౌడ్ కోరారు. శనివారం గరిడేపల్లి మండల కేంద్రంలో ఆ సంఘం అధ్యక్షుడు జంజనం కోటేశ్వరరావు అధ్యక్షతన జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ఎన్నికల కోడ్‌ను ఉల్లంఘించకుండా కార్మికులు మే డేను ఘనంగా నిర్వహించాలని సూచించారు. ఎండలు తీవ్రంగా ఉన్నందున కార్మికులు పని ప్రదేశాల్లో తలపాగాలు ధరించి తగు జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో కమిటీ సభ్యులు షేక్ సత్తార్, గుంజ రవీందర్, సైదా హుస్సేన్, పటాన్ కరిముల్లా, శివ, సారయ్య, గురవయ్య, నారాయణ, ఉపేందర్ తదితరులు పాల్గొన్నారు.

మఠంపల్లిలో కొనసాగుతున్న ఎడ్ల పందేలు



ఫ్లడ్‌లైట్ల వెలుతురులో బండ లాగుతున్న గిత్తలు

మఠంపల్లి: మండల కేంద్రంలో శుభవార్త చర్చి తిరనాళ్లను పురస్కరించుకుని స్థానిక శుభోదయ యువజన సంఘం ఆధ్వర్యంలో వీవీ హైస్కూల్ గ్రౌండ్‌లో నిర్వహిస్తున్న రెండు తెలుగు రాష్ట్రాల స్థాయి ఎడ్ల పందేలు రసవత్తరంగా కొనసాగుతున్నాయి. ఆరు పండ్ల విభాగంలో ఏపీలోని పల్నాడు జిల్లా, గుంటూరు జిల్లా, ఎన్టీఆర్ కృష్ణా జిల్లా, ప్రకాశం జిల్లా, సూర్యాపేట, ఖమ్మం జిల్లాలకు చెందిన సుమారు 16జతల గిత్తలు తలపడ్డాయి. ఇందులో విజేతలుగా నిలిచిన ఏడు జతల గిత్తలకు నగదు బహుమతులు అందజేయనున్నట్లు శుభోదయ యువజన సంఘం అధ్యక్షుడు గాదె జయభారత్‌రెడ్డి తెలిపారు. మాజీ సర్పంచ్ ఆదూరి స్రవంతికిషోర్‌రెడ్డి, మధుసూదన్‌రెడ్డి, లూర్దుమారెడ్డి, బాలరెడ్డి, గాలి చిన్నపురెడ్డి, బోయపాటి ఆంథోనిరెడ్డి, టీఆర్ బాలశౌరెడ్డి, ఆదూరి శౌరెడ్డి, బాలరెడ్డి, శుభోదయ యువజన సంఘం సభ్యులు గాదె పవన్ రెడ్డి, తానం బాలరెడ్డి, కందుల కిరణ్‌కుమార్‌రెడ్డి, నలిబండ్ల రాజేష్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

గోవింద్ ఆశయ సాధనకు కృషి చేయాలి



గోవింద్ స్మారకస్థూపం వద్ద నివాళులర్పిస్తున్న సీపీఐ (ఎంఎల్) న్యూడెమోక్రసీ నాయకులు

గరిడేపల్లి : గోవింద్ ఆశయ సాధనకు ప్రతిఒక్కరూ కృషి చేయాలని సీపీఐ (ఎంఎల్) న్యూడెమోక్రసీ డివిజన్ కార్యదర్శి పోటు లక్ష్మయ్య అన్నారు. శనివారం గరిడేపల్లి మండల పరిధిలోని వెలిదండ గ్రామంలో సీపీఐ (ఎంఎల్) న్యూడెమోక్రసీ గ్రామ కమిటీ ఆధ్వర్యంలో గోవింద్ 13వ వర్ధంతి నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన స్మారకస్థూపం వద్ద నివాళులర్పించారు. అనంతరం పార్టీ గ్రామ కార్యదర్శి మేకల కనకారావు జెండా ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో ఐఎఫ్‌టీయూ జిల్లా అధ్యక్షుడు కామళ్ల నవీన్, మాశెట్టి అంజయ్య, శ్రీను, పెద్ద సాంబయ్య, బ్రహ్మయ్య, లచ్చయ్య, అంజయ్య, శ్రీహరి, మంగమ్మ, సైదులు, లక్ష్మయ్య, ముత్తయ్య, కుమరయ్య, సూర్యం, సైదులు, పర్వతాలు, ఎల్లమ్మ పాల్గొన్నారు.

సోమయ్యకు నివాళి

హుజూర్‌నగర్ : హుజూర్‌నగర్‌లో ఇటీవల మృతి చెందిన వ్యాపారవేత్త గుండా సోమయ్య సంతాప సభను శనివారం నిర్వహించారు. ఈ సందర్భంగా పట్టణంలోని వివిధ పార్టీల నాయకులు, పలువురు పాల్గొని ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. సోమయ్య సేవలను కొనియాడారు. ఈ సమావేశంలో స్థానికులు, తదితరులు పాల్గొన్నారు.

భవిష్యత్‌లో ఫార్మా రంగానికే అధిక ప్రాధాన్యం

చివ్వెంల(సూర్యాపేట) : భవిష్యత్‌లో ఫార్మా రంగానికే అధిక ప్రాధాన్యం ఉంటుందని స్టార్ టెక్ కంపెనీ ఈడీ ఉపేంద్ర ఎం.త్రిపాఠి అన్నారు. శనివారం మండల పరిధిలోని దురాజ్‌పల్లి గ్రామశివారులోని ప్రతిష్ఠా ఫార్మసీ కళాశాలలో బీ ఫార్మసి, డీ ఫార్మసి, ఫామ్ డీ చివరి సంవత్సరం చదువుతున్న విద్యార్థులకు క్యాంపస్ ప్లేస్‌మెంట్స్ నిర్వహించారు. కళాశాల నుంచి 12మంది విద్యార్థులు ఉద్యోగాలకు ఎంపికయ్యారు. కళాశాల చైర్మన్ శివరామకృష్ణ, ప్రిన్సిపల్ రాజ్‌కుమార్, సెక్రటరి విజయలక్ష్మి, వైస్ ప్రిన్సిపల్ డాక్టర్ మధు, రమేష్ పాల్గొన్నారు.